అంతర్ జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం



ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే, కార్పొరేటర్

రామంతాపూర్ : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ హైదరాబాద్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామంతాపూర్ జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన తెలంగాణ అంతర్ జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీలను ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే భేతి సుభాశ్‌రెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ చైర్మన్ బుచ్చిదాస్‌గౌడ్, ప్రెసిడెంట్ రమేశ్‌గౌడ్, జోసెఫ్, జేమ్స్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన



డ్రైనేజీ పనులు
పరిశీలిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: సూర్యనగర్‌లో భూగర్భ డ్రైనేజీ పనులను మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు మరో 40 మీటర్ల డ్రైనేజీ లైన్‌ను పొడిగించాలని ఆయనను కోరారు. దీంతో స్పందిస్తూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు యాదగిరి గౌడ్, నర్సింగ్‌రావు, నాగేశ్వర్‌రావు, చిన్న, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపుగానే అవార్డు



బొజ్జ యాదగిరిని అభినందిస్తున్న
మంత్రి దామోదర్ రాజనర్సింహ

మల్లాపూర్: ప్రజా సమస్యలపై పోరాటాలు చేసిన సేవలను గుర్తించే రాష్ట్ర ప్రభుత్వం దళిత జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొజ్జ యాదగిరికి దళిత రత్న అవార్డు అందజేసిందని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. బొజ్జ యాదగిరిని శుక్రవారం ఆయన శాలువాతో సత్కారించి అభినందించారు. కార్యక్రమంలో దళిత జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంపత్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొజ్జ రమేశ్, కిష్టయ్య తదితరులు ఉన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



పూజలు చేస్తున్న
మొత్కూరు సత్యనారాయణ శాస్త్రి

అల్వాల్: వెంకటాపురం కానాజీగూడలోని మరకత శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఉదయం నుంచే స్వామివారికి సుప్రభాత సేవ, విశేష అభిషేకం, జపతర్పణ హోమాలతోపాటు భక్తులతో మహాలింగార్చన కొనసాగించారు. సాయంత్రం శాంతి కల్యాణం, పరిపూర్ణం తదితర కార్యక్రమాలు నిర్వహించామని ఆలయ వ్యవస్థాపకుడు మొత్కూరు సత్యనారాయణ శాస్త్రి తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు మరకత గణపతి లాకెట్ ఉచితంగా పంపిణీ చేశారు.

'భూ భారతి'తో భూ వివాదాల పరిష్కారం సులభం

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'భూ భారతి' నూతన ఆర్ఓఆర్ చట్టం భూ వివాదాల పరిష్కారాలను సరళతరం చేసేందుకు దోహదపడుతుందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. భూభారతి చట్టంలోని నిబంధనలపై అవగాహన పెంచేందుకు అవాంతరాలు లేని సేవల విస్తరణకు పౌరులు, రైతులు, రైతు సంఘాలు, ప్రజాప్రతినిధులతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మండల స్థాయిలో ఈనెల 19 నుంచి 26 వరకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 19న మూడుచింతలపల్లిలోని కేశవరం గ్రామంలోని సూపర్ సంగీత్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10.30 గంటల నుంచి సదస్సు ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రజలు, రైతులు, రైతు సంఘాలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు.

అక్రమ నిర్మాణాలపై నజర్!

శివారు మున్సిపాలిటీల్లో భవనాలు, వ్యాపార సముదాయాల గుర్తింపునకు చర్యలు

- ఉన్నతాధికారుల ఆదేశాలతో కొనసాగుతున్న లెక్కింపు ప్రక్రియ
- రికార్డులు, నిర్మాణ వ్యత్యాసాలపై ప్రత్యేక దృష్టి
- నిర్లక్ష్యం వహిస్తున్న 'పుర' సిబ్బందికి తాఖీదులపైనా కసరత్తు



మైసమ్మగూడలోని నిర్మాణాలు

సాక్షి,సిటీబ్యూరో: నగర శివారు పట్టణాల్లోని అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. అక్రమంగా నిర్మించిన ఇళ్లు, బహుళ అంతస్తులు, వ్యాపార వాణిజ్య సముదాయాల జాబితా పంపాలని రాష్ట్ర పురపాలిక శాఖ అధికారులు ఆదేశించడంతో నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో ప్రక్రియను ప్రారంభించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ప్రతి మున్సిపాలిటీలో అనుమతుల్లేని నిర్మాణాలు పదుల సంఖ్యలో ఉన్నట్లు అధికార యంత్రాంగం భావిస్తోంది.

ప్రత్యేక జాబితాలోకి..రికార్డుల్లో లేని ఇళ్లు

పట్టణాల్లో రికార్డు పరంగా ఉన్న ఇళ్లకు, వాస్తవంగా ఉన్న నిర్మాణాలకు వ్యత్యాసం ఉండడంతో ఆ దిశగా లెక్కింపు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. వార్డులు/డివిజన్ల వారీగా ఇళ్ల జాబితాను తీసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. రికార్డుల్లో లేని నిర్మాణాలను ప్రత్యేక జాబితాలో నమోదు చేస్తున్నారు. ఏళ్లుగా భవన నిర్మాణాలు, వ్యాపార వాణిజ్య సముదాయాలు ఉన్నప్పటికీ మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలు రికార్డుల్లో నమోదు చేయకపోవడంతో ఇప్పుడు అవి సంబంధిత అధికారుల దృష్టికి చేరుతున్నట్లు తెలుస్తోంది. 2, 3 అంతస్తులున్న వారు, పెద్ద భవనాలున్న వారు సైతం తమకు ఒక అంతస్తు మాత్రమే ఉందని రికార్డులో నమోదు చేయించుకున్నట్లు తెలుస్తోంది. ఇలాంటివి కూడా లెక్కింపుల్లో బయట పడుతున్నాయి.



పోచారంలో..

చర్యలు ఇలా..

- పురపాలక సంఘాల గుర్తింపు ప్రక్రియలో అనుమతుల్లేని నిర్మాణమని తేలితే ఎన్నేళ్ల కిత్రం కట్టారో వివరాలు సేకరిస్తారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఎంతమేర పన్ను అవుతుందో ఆ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది.
- ఒకే అంతస్తు అనుమతి తీసుకుని 2, 3 అంతస్తులు నిర్మించుకున్న వారికి కూడా ఇదే నిబంధన వర్తిస్తోంది.
- సర్వేలో ఇంటికి సంబంధించి పూర్తి వివరాలు, ప్లాటు విస్తీర్ణం, ఇంటిని నిర్మించిన స్థలం, ఖాళీ స్థలం ఎంత ఉంది అనేది గుర్తిస్తున్నారు.
- కొత్తగా నిర్మించుకుంటున్న వాటిని పరిశీలించి అనుమతి లేకపోతే నిర్మాణాన్ని నిలిపేయాలని యజమానికి ఆదేశాలిస్తారు.

పకడ్బందీగా..

పురపాలక శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నప్పటికీ, ఇందులోనూ రాజకీయ నాయకుల జోక్యం ఉంటున్నట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని పరిశీలించడంతో పాటు బయటపడిన నిర్మాణాల యజమానులపై చర్యలు తీసుకుంటామని పేర్కొంటున్నా.. ఇందులో కూడా దాగుడు మూతలు ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

3,691 అక్రమ నిర్మాణాల గుర్తింపు!

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని పురపాలక సంఘాల్లో ఇప్పటివరకు 3,691 అక్రమ కట్టడాలు, బహుళ అంతస్తులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఘట్‌కేసర్ మండలం పరిధిలోని మున్సిపాలిటీల్లో 676, దుండిగల్ పరిధిలో 1962, కీసర మండలంలోని మున్సిపాలిటీల్లో 669, తూంకుంట పరిధిలో 206, మేడ్చల్ మండల పరిధిలోని మున్సిపాలిటీల్లో 206, నిజాంపేట్ కార్పొరేషన్‌లో 76, కొంపెల్లి మున్సిపాలిటీలో 42, మేడిపల్లి మండల పరిధిలోని పురపాలక సంఘాల్లో 78, జవహర్‌నగర్‌లో 68 అక్రమ కట్టడాలు ఉన్నట్లు తెలుస్తోంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల సంఖ్య 1.68 లక్షలు కాగా, 13 పురపాలక సంఘాల పరిధిలో అనుమతుల్లేని భవనాలు, వ్యాపార సముదాయాలు వందల్లోనే ఉంటాయని అంచనా వేస్తున్నారు. జిల్లాలోని ఓ పురపాలక సంఘంలో తాజా మాజీ వైస్ చైర్మన్ 2 అంతస్తుల భవన నిర్మాణానికి అనుమతి తీసుకుని.. 4 అంతస్తులు నిర్మించినట్లు తెలుస్తోంది. మిగతా పురపాలక సంఘాల్లో కూడా మాజీ , తాజా ప్రజాప్రతినిధులకు సంబంధించిన భవనాల అక్రమ బాగోతం బయట పడుతున్నట్లు తెలుస్తోంది. ఇదంతా పురపాలక సంఘాల్లోని టౌన్‌ప్లానింగ్ అధికారులతో సహా కమిషనర్లకు తెలిసినా.. చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుందని స్థానికులు, పలు స్వచ్ఛంధ సంస్థలు, ప్రజా సంఘాలు , సమాచార హక్కుల కార్యకర్తలు పేర్కొంటున్నారు. చెరువులు, కుంటలు, మురుగు కాలువలు, రోడ్లతో సహా ప్రభుత్వ, అసైన్డ్ భూములను ఆక్రమించి భవనాలను నిర్మించినా రెవెన్యూ, పుర, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు పట్టణ ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

ఆలయ బ్రహ్మోత్సవాలు షురూ



సామూహిక కుంకుమార్చనలో మహిళలు

మల్కాజిగిరి: ఎస్పీనగర్‌లోని వారాహీ ప్రత్యంగీ షిర్డీ సాయిబాబా ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మొదటి రోజు గణపతిపూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, మూలవిరాట్‌లకు విశేష అభిషేకం, సామూహిక కుంకుమార్చన తదితర పూజలు శ్రీనివాసా గురుమూర్తి ఆధ్వర్యంలో జరిగాయి. శనివారం ఉదయం శత ఘటాభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రామకృష్ణ, లక్ష్మణ్‌రావు, రాములు, శ్రీకాంత్, శ్రీనివాస్, శ్రవణ్, దీపక్ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ పునః ప్రతిష్ఠ మహోత్సవం



ప్రత్యేక పూజల్లో కిశోర్‌గౌడ్ తదితరులు

బోడుప్పల్: ఈస్ట్ బాలాజీహిల్స్ ఫేజ్-1లోని నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయ పునఃనిర్మాణం, విగ్రహ పునః ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ సుమన్ నాయక్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ క మిటీ ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం



మేడిపల్లిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

బోడుప్పల్: వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించనున్న రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేద్దామని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పిలుపునిచ్చారు. బోడుప్పల్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సభ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆటోలకు పోస్టర్లు అంటించారు. కార్యక్రమంలో బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, నేతలు కొత్త చక్ర పాణిగౌడ్, చంటి శ్రీనివాస్, బందారం శ్రీధర్‌గౌడ్, కాటపల్లి రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మేడిపల్లి: ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్‌ను మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మా రెడ్డి, పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డితో కలిసి మేడిపల్లి పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేశ్, మధుసూదన్ రెడ్డి, నాయకులు తేతాకుల రఘుపతి రెడ్డి, మంద సంజీవ రెడ్డి, ఎడవల్లి రఘువర్ధన్ రెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ చింతల శాంతి

సభకు తరలిరావాలి

అల్వాల్: ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిరావాలని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి శ్రేణులకు పిలుపునిచ్చారు. అల్వాల్‌లోని తన నివాసంలో శ్రేణులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శ్రేణులు, నాయకులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



దుర్గాదేవి

మల్కాజిగిరి: వివాహిత అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గుంటూరు జిల్లా పొట్లపాడు గ్రామానికి చెందిన సుబ్బారావు ఆటో డ్రైవర్. జీవనోపాధి కోసం భార్య దుర్గాదేవి (29)తో కలిసి 7 నెలల క్రితం మల్కాజిగిరి మల్లికార్జుననగర్‌కు వలస వచ్చాడు. ఈనెల 16న ఇంటి నుంచి బయటకు వెళ్లిన సుబ్బారావుకు అదే ప్రాంతంలో ఉంటున్న దుర్గాదేవి సోదరి సుమ దుర్గాదేవి కనిపించడం లేదని సుబ్బారావుకు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. దీంతో ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో సుబ్బారావు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి
వినతి పత్రం ఇస్తున్న ప్రతినిధులు

అల్వాల్: సమస్యలు పరిష్కరించాలని టెలికాం కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు నూతనంగా ఎన్నికైన టెలికాం కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. కాలనీలో పలుచోట్ల డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, అలాగే వీధి దీపాలు వెలగడం లేదని అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలో కాలనీలో పర్యటిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి
పాలాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: మహేంద్రహిల్స్‌లో 5 ఎంఎల్ రిజర్వాయర్ మంజురుకు కృషి చేసిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గౌతంనగర్ డివిజన్‌లోని సుమారు 32 కాలనీలకు మహేంద్రహిల్స్‌లో నిర్మించే రిజర్వాయర్ నుంచే తాగునీటి అందిస్తారన్నారు. రిజర్వాయర్ మంజూరు జీవో కాపీ శుక్రవారం అందిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాముయాదవ్, శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాక్స్‌డ్రైన్ నిర్మాణం పరిశీలన



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: భ్రమరాంభికానగర్‌లో బాక్స్ డ్రైన్ పనులను మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం రాకముందే పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించామన్నారు. బాక్స్ డ్రైన్ నిర్మాణానికి నిధులు సరిపోకపోవడంతో మరో రూ.70 లక్షలు మంజూరు చేయాలని జోనల్ కమిషనర్‌ను కోరామన్నారు. ఈ పనులు పూర్తయితే దాదాపుగా వరద ముప్పు సమస్య పరిష్కారమవుతుందని పేర్కొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

రామంతాపూర్: మేడిపల్లిలో నివాసముండే మహేశ్ యాదవ్ భార్య లక్ష్మీయాదవ్‌కు శుక్రవారం పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. దీంతో ఉప్పల్ 108 సిబ్బంది వెంటనే మేడిపల్లికి వెళ్లి గర్భిణిని గాంధీ హాస్పిటల్‌కు తరలిస్తుండగా ఉప్పల్ దగ్గరికి చేరుకోగానే ఆమెకు పురిటి నొప్పులు అధికం కావడంతో అంబులెన్స్‌లోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని వారిని 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ నాగరాజు పైలెట్ ఉపేందర్ తెలిపారు. అనంతరం ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్చారు.



'సోనియా, రాహుల్‌పై కేసులు కక్షపూరితం'



మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

రామంతాపూర్ : కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ కేసులు పెట్టడం కక్షపూరితమని ఆరోపిస్తూ రామంతాపూర్ ఆ పార్టీ ఇన్‌చార్జి తవిడబోయిన గిరిబాబు, సుర్వీ మురళీగౌడ్ కార్యకర్తలు, నేతలతో కలిసి రామంతాపూర్ ప్రధాన రహదారిలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ నేత ఉప్పల్ మాజీ మున్సిపల్ చైర్మన్ మేకల శివారెడ్డి మాట్లాడుతూ.. రాజకీయ దృష్టి కోణంతో తప్పుడు కేసులు పెట్టి వేధిస్తుండడం తగదన్నారు. కార్యక్రమంలో నేతలు జనంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవి కుమార్, కృష్ణ, రాఘవరెడ్డి, మోహన్‌రెడ్డి, వినోద్ ముదిరాజ్, పత్తికుమార్, మాజీ కార్పొరేటర్ పావని, మణిపాల్, కోటేష్, భిక్షపతి చారి పాల్గొన్నారు.

హెచ్‌పీసీఎల్ ప్లాంట్ మేనేజర్‌గా బాధ్యతల స్వీకరణ



హెచ్‌పీసీఎల్ జీఎంను
సత్కరిస్తున్న ఉద్యోగులు, నేతలు

కుషాయిగూడ: చర్లపల్లి పారిశ్రామికవాడలోని హిందుస్థాన్ పెట్రోలియం లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ప్లాంట్ మేనేజర్‌గా సురేశ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు విధులు నిర్వర్తించిన ఉదయ్‌కృష్ణ వైజాగ్ ప్లాంట్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో సురేశ్ కుమార్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సంస్థ ఉద్యోగులు, కార్మికులు, స్థానిక నేతలు ఉదయ్‌కృష్ణకు వీడ్కోలు, సురేశ్‌కుమార్‌కు స్వాగతం పలికి వారిని ఘనంగా సత్కరించారు. అలాగే చర్లపల్లి ప్లాంట్ సమీపంలో రోడ్డు మరమ్మతుల కారణంగా గాంధీనగర్ కాలనీవాసులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని, పనులు త్వరగా పూర్తి చేయాలని కొత్త జీఎంను కోరారు. కార్యక్రమంలో ఆల్వా కృష్ణారెడ్డి, బూడిద శ్రావణ్‌కుమార్‌గౌడ్, జౌండ్ల ప్రభాకర్‌రెడ్డి, దొంతులు జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 33/11 కేవీ మల్లాపూర్ నోమా సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవీ లక్ష్మీనగర్ నరసింహనగర్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మల్లాపూర్ విద్యుత్ ఏఈ నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మైఫ్లవర్ హైట్స్, లక్ష్మీనరసింహ కాలనీలు. 11 కేవీ అన్నపూర్ణ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 3.30 వరకు శ్రీనివాస్ స్కూల్ లైన్, మై ఫ్లవర్ గ్రాండ్, జనప్రియ టౌన్‌షిప్, అన్నపూర్ణ కాలనీ, లింగమయ్యనగర్ కాలనీలు.

ఐఐసీటీ సబ్‌స్టేషన్ పరిధిలో..

33/11 కేవీ ఐఐసీటీ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ స్నేహపురి ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నాచారం స్నేహపురి కాలనీ, శ్రీనగర్ కాలనీ, భవానీనగర్, రోడ్ నంబర్ 3,4,5, వీఎస్టీ కాలనీ, పీఅండ్‌టీ కాలనీ, నాచారం మెయిన్ రోడ్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ టూ మసీద్ వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని హబ్సిగూడ ఏఈ గణేశ్ తెలిపారు.

ఇందిరానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

బోడుప్పల్: పలు కాలనీల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ తెలిపారు. ఇందిరానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరస్వతీ నగర్, శ్రీనగర్, విజయపురి కాలనీ, శ్రీలక్ష్మీనగర్, ఉదయ్‌నగర్, అశోక్‌నగర్, ప్రశాంతినగర్. ఆర్ఎన్ఎస్ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 వరకు అన్నపూర్ణ కాలనీ, పద్మావతి కాలనీ, వెంకట్‌రెడ్డి కాలనీ, బీఎల్‌నగర్, సాయి నగర్, ఆర్ఎస్ఎస్ కాలనీ, మణికంఠ నగర్, వివేకానందనగర్, శ్రీలక్ష్మీనగర్, లెక్చరర్స్ కాలనీ, ఎస్ఐఎస్ కాలనీ, భీంరెడ్డినగర్ కాలనీలు.

వెంకటరెడ్డినగర్ ఫీడర్ పరిధిలో..

రామంతాపూర్: వెంకటరెడ్డినగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ అంతరాయం ఏఈ లావణ్య తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎండోమెంట్ కాలనీ, గోకుల్ నగర్, ఆర్టీసీకాలనీ, రామ్ శంకర్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆమె కోరారు.

11కేవీ ఆర్టీసీ కాలనీ ఫీడర్ పరిధిలో..

మేడిపల్లి: 11కేవీ ఆర్టీసీ కాలనీ ఫీడర్ పరిధిలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనుల మరమ్మతుల కారణంగా 33/11 కేవీ చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గణేశ్‌నగర్, ఇంద్రానగర్, బృందావన్‌కాలనీ, సుశీలా టౌన్‌షిప్, హరిప్రియకాలనీ, శివశక్తి నగర్, సాయినగర్, మాతా అరవింద కాలనీ, హిమగిరి కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

11కేవీ వెంకటసాయి నగర్ ఫీడర్ పరిధిలో..

సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 33/11 కేవీ చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు సాయిరెసిడెన్సీ, వెంకట సాయినగర్, ప్రీవిలేజ్, కృష్ణానగర్

11కేవీ ఎస్ఐఎస్, బుద్ధానగర్ ఫీడర్ పరిధిలో..

11కేవీ ఎస్ఐఎస్, బుద్ధానగర్ ఫీడర్ పరిధిలో ఈనెల 19న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ హరినాథ్ సగ్గు తెలిపారు. 33/11 కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 వరకు పీఅండ్‌టీ కాలనీ, బుద్ధానగర్, మల్లికార్జునగర్, బోడుప్పల్ మైన్ రోడ్డు.

మేడ్చల్ ఏటీసీ ప్రారంభానికి సిద్ధం



మేడ్చల్: మేడ్చల్ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధమయ్యింది. ప్రభుత్వం ఐటీఐల్లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ పేరుతో డిప్లోమా కోర్సులకు సాంకేతికతను తోడు చేసి నూతన ఐటీఐలను ఏటీసీల పేరుతో ప్రయోగాత్మకంగా మేడ్చల్ ఐటీఐలో ఏర్పాటు చేసింది. మేడ్చల్ ఐటీఐలో సువిశాల ప్రాంగణలో సెంటర్‌ను ఏర్పాటు చేసి అన్ని వసతులు కల్పించారు. ఐటీఐలో పాత టెక్నాలజీ కొనసాగుతుండగా ఏటీసీలలో నూతన టెక్నాలజీ ఉంటుందని అధికారులు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి నూతనంగా 250 మంది విద్యార్థులు ఏటీసీలో చదివే అవకాశం ఉందని ఐటీఐ ప్రిన్సిపాల్ హనుమానాయక్ తెలిపారు. ఏటీసీలో అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ టెక్నీషన్, ఎలక్ట్రిక్ వాహనాల మెకానిక్, మెకానికల్ బేసిక్ డిజైనర్, రోబోటిక్, డిజిటల్ మాన్యుఫ్యాక్చర్ టెక్నీషన్, అడ్వాన్స్ టూల్, ప్రాసెస్, ఆటోమెషన్ కంట్రోల్ వంటి కోర్సులు ఉంటాయని దీని ద్వారా విద్యార్థులకు మరిన్ని ఉద్యోగావకాశాలు వస్తాయని ఆయన పేర్కొన్నారు.